అమరుల సేవలు మరువలేనివి


ఆత్మకూర్‌లో ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

ఆత్మకూర్: పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూర్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్‌ఐ బీచుపల్లి మాట్లాడుతూ ప్రతిక్షణం ప్రజల కోసమే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కొందరు ప్రాణాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాలీశ్వర్‌రెడ్డి, గుప్త, మునీశ్వర్‌రెడ్డి, వెంకటన్నగౌడ్, ఫయాజ్, రాజేందర్, యుగంధర్, క్రాంతి, సురేందర్, రాములు, స్వర్ణలత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పోలీసు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద సామాజిక కార్యకర్త కమ్మరిగోపి ఆధ్వర్యంలో పోలీసు అమరుల చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ బద్రునాయక్, ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, విజయలక్ష్మి పోలీసుల శాఖ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే 39 మంది పోలీసులు పలు ఘటనల్లో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పుష్ప, హోంగార్డు శ్రావణ్‌కుమార్, ఎఫ్‌ఏ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


మదనాపురంలో పోలీసు అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

గోపాల్‌పేట: వానాకాలంలో వరి కొనుగోళ్లు పకడ్బందీగా జరపాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని వ్యవసాయ అధికారులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అధికారులు ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, బుక్‌కీపర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలంలో నిర్వహించే కొనుగోళ్ల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సన్నరకం వడ్లను గుర్తించేందుకు వాడే డ్యుయల్ మైక్రో మీటర్ వినియోగంపై అవగాహన కల్పించారు. సన్నరకం గింజల ముక్క పొడవు, వెడల్పు నిష్పత్తి ద్వారా గుర్తించాలని, గింజ పొడవు 6 ఎంఎం, వెడల్పు రెండు ఎంఎం ఉంటేనే సన్నరకం వడ్లుగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, ఏఈఓలు నాగరాజు, శిరీష, అంజనమ్మ, ప్రకాశ్, లోకేశ్వరి, ఐకేపీ సెంటర్ బుక్‌కీపర్స్, ఇంచార్జ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఈఓ నాగరాజు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

అమరచింత: మున్సిపాలిటీలోని కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, గ్రామకంఠం భూమిని కాపాడాలంటూ కలెక్టర్ ఆదర్శ్‌సురభికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా గ్రామకంఠం స్థలంలో మహిళలు సామూహిక మరుగుదొడ్లుగా వాటిని వినియోగించుకుంటున్నారని, మహిళల సౌకర్యం కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించారన్నారు. ప్రస్తుతం రూ.కోట్ల విలువ గల స్థలాన్ని స్వచ్ఛంద సంస్థ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మండిపడ్డారు. వాటిని ఆధారాలతో బీజేపీ బయటపెట్టినా.. మున్సిపల్ అధికారులు నేటికీ స్థలంలో ప్రభుత్వ స్థలం అంటూ సూచికబోర్డును ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజల సంక్షేమం కోసం వాటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మేర్వరాజు, రాకేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ఆత్మకూర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని పదిశాతం ప్లాట్లు, చెరువు భూములను రక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, కమిషనర్ శశిధర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఐదు వందలకు పైగా ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని, అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూములు సైతం ఆక్రమణలకు గురయ్యాయని, చెరువు వద్ద అక్రమ కట్టడాలు వెలిసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పలుదఫాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సైతం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, గంగాధర్, షంషీర్, రఫీఖ్, నిరంజన్, వంశీ, శ్రీకాంత్, రమేష్‌యాదవ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాలల రక్షణకు సమష్టి కృషి


బుసిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణమ్మ

పాన్‌గల్: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బుసిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి కృష్ణమ్మ అన్నారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో బాల్య వివాహాల నివారణ, బాలకార్మిక నిర్మూలన, చదువుతో కలిగే లాభాలు, చిన్నతనంలో వివాహాలు చేయడం ద్వారా కలిగే నష్టాలు తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా.. సహకరించిన చట్టారీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు విజయమ్మ, ఫీల్డు అసిస్టెంట్ జన్మనాయుడు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వీపనగండ్లలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాణి

వీపనగండ్ల: బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే బాలబాలికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎస్‌ఐ రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలిగించి వారికి, శక్తికి మించిన పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ బాలల పరిరక్షణ కమిటీలో పలువురు మండల, గ్రామ స్థాయి అధికారులను సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దర్గయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో జరుగుతున్న ఎస్‌ఏ పరీక్షలు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వారి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతగా భోజనం అందించాలని ఆదేశించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ప్రతి విద్యార్థి సమయపాలన పాటిస్తూ ప్రార్థనకు తప్పక హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా ఎస్‌ఓ హేమలత, పీఎస్ హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్వీపర్‌కు సన్మానం



పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్య కుమార్తె వనితకు ఇటీవల డీఎస్సీ ఫలితాలల్లో విజయం సాధించి ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడంపై వెంకటయ్యను అభినందిస్తూ సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసులు శాలువాతో ఘనంగా సన్మానించారు. వెంకటయ్య స్వీపర్ ఉద్యోగం చేస్తూ తన కూతురును మంచిగా చదివించి ఉపాధ్యాయురాలుగా ఎంపిక అయ్యే విధంగా తీర్చిదిద్దటం అందరికి ఆదర్శం అని ఎంఈఓ కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది గోవింద్‌నాయక్, శేఖర్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభను జయప్రదం చేయండి



ఆత్మకూర్: పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ నెల 24 ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో స్వర్ణోత్సవాల సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోయిన్‌ఆలీ, సందీప్, జాఫర్, ఉషారాణి, రేవతి, వరలక్ష్మి, లావణ్య, మాధూరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌కు సన్మానం



వనపర్తి టౌన్: ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులును సోమవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాతగంజ్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. వనపర్తివాసి అయిన శ్రీనివాసులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా ఎన్నిక కావడం వనపర్తికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, చిత్తారి ప్రభాకర్, బాశెట్టి శ్రీనివాసులు, రాము, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

దేవేంద్రచార్యుల ఆరాధనోత్సవాలు

అమరచింత: నాగల్‌కడ్మూర్‌లోని శ్రీశ్రీ దేవేంద్రచార్యుల మఠంలో స్వామివారి 72వ దివ్య ఆరాధనోత్సవ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజామున దేవేంద్రచార్యుల ఆలయంలో స్వామివారి విగ్రహానికి పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మఠంలో గోమాత పూజ అనంతరం హోమం నిర్వహించారు. మఠంలో మూడు రోజుల పాటు జరిగే ఆరాధనోత్సవాల్లో శ్రీగాయత్రి పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామితో పాటు కాళికాంబ ఉపాసకులు గుండెపల్లి నరేష్ ఆచార్యులు హాజరై ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి సందేశాలను అందిస్తారని ఆలయ నిర్వాహకుడు నరసింహాచారి తెలిపారు. ఆరాధనోత్సవాల్లో పాల్గొనే భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వసతిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.


హోమం చేస్తున్న భక్తులు

సీపీఎం మండల కార్యదర్శిగా బాల్‌రెడ్డి



వీపనగండ్ల: సీపీఎం మండల కార్యదర్శిగా గోపల్‌దిన్నెకు చెందిన దొడ్ల బాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపల్‌దిన్నెలో జరిగిన మండల 7వ మహాసభలలో రెండోసారి బాల్‌రెడ్డిని మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేసే బాల్‌రెడ్డిని రెండోసారి ఎంపికవ్వడం పట్ల పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

పాన్‌గల్: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన ఘటనలో భర్తపై సోమవారం మండలంలో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన మండ్ల భాగ్యలక్ష్మికి పదేళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన మండ్ల లక్ష్మణ్‌తో వివాహం చేశారు. వివాహం సమయంలో వరకట్నం కింద 4 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు ఇచ్చారన్నారు. మూడేళ్లుగా భర్త, మామ ధర్మయ్య, భర్త సోదరుడు శంకర్, తోటి కోడలు నిర్మల మాటలు విని అదనపు కట్నం తీసుకరావాలని మానసికంగా, శారీరకంగా భార్యను వేధిస్తున్నాడు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా భర్త, వారి కుటుంబ సభ్యులల్లో మార్పు రాలేదన్నారు. ఈ క్రమంలో భర్త లక్ష్మణ్‌తో పాటు కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మిని మార్చిలో ఇంట్లో నుంచి గెంటివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తన సొంత ఊరు బుసిరెడ్డిపల్లిలోనే ఉంటుంది. అప్పటి నుంచి భార్యను కాపురానికి తీసుకెళ్లలేదు. దీంతో అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన భర్త, వారి కుటుంబ సభ్యులపై చట్టారీత్యా తగు చర్యలు తీసుకోవాలని సోమవారం భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌బీఐ ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలని ఎస్‌బీఐ ఆల్ ఇండియా చైర్మన్ చెల్లా శ్రీనివాసులుశెట్టికి సోమవారం వినతి పత్రం అందిచామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అమరచింత మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రస్తుతం మండలంలో కేవలం యూనియన్ బ్యాంక్ మాత్రమే ఉండటంతో మండలంలోని 14 గ్రామాలతో పాటు నర్వ, ఆత్మకూర్ మండలాల్లోని మరో 13 గ్రామాల ప్రజలు సేవలు పొందుతున్నారని తెలిపారు. ఈ బ్యాంకు పరిధిలో సుమారు 60 వేల మంది ఉన్నారని, దీంతో ప్రతి నిత్యం బ్యాంకు వినియోగదారులతో కిక్కిరిపోతుందన్నారు. మండలంలో ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు లేకుండా ప్రజలు బ్యాంక్ సేవలు పొందుతారన్నారు. కార్యక్రమంలో సిద్ధురాములు, రాకేష్ శెట్టి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డి హత్య కేసు ఛేదనలో పోలీసులు విఫలం

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిందితులను పట్టుకోకపోవడం ఏంటని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ప్రశ్నించారు. ఆయన మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులతో కలిసి మూడు గంటల పాటు బైఠాయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో ఎన్నో అనుమానాలకు తావిస్తోందని, రాష్ట్ర మంత్రి సొంత మండలంలో ఘటన జరిగి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కేసు ఎందుకు పురోగతి సాధించడం లేదన్నారు. చిన్న చిన్న దొంగతనాల కేసులను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకునే పోలీసులు శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనలో నిందితులను ఎందుకు పట్టుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు బీజేపీ నాయకులను సముదాయించారు. శ్రీధర్‌రెడ్డి కేసును సవాల్‌గా తీసుకుని విచారిస్తున్నామని, నాలుగు ప్రత్యేక బృందాలతో విచారణ కొనసాగుతుందన్నారు. కేసులో ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని, త్వరలో నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో బీజేపీ శ్రేణులు ధర్నాను విరమించారు. ఇరవై రోజుల్లో కేసుకు సంబంధించిన అంశాలను బహిర్గతం చేయాలని, లేకపోతే హత్య కేసులో ప్రజా ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజవర్గ నాయకులు ధారాసింగ్, సందు రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపినాయుడు, కిరణ్‌కుమార్, సాయిగౌడ్, పురేందర్‌గౌడ్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన బీజేపీ

డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. తాగడానికి, వాడుకోవడానికి నీరు లేదని, నిధులు మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ లేదన్నారు. సరిపడా అధ్యాపకులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని స్పష్టం చేశారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

గోపాల్‌పేట: ప్రజలు సోషల్ మీడియా వేదికలు వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాద్యమాల ద్వారా వ్యక్తులు, రాజకీయ నాయకులు, పార్టీల గురించి గాని కించపరిచే విధంగా మాట్లాడటం, అవమానిస్తూ పోస్టులు పెట్టడం సరికాదని ఎస్‌ఐ రాము అన్నారు. ఈ విషయంపై బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే, అది నిజమని ఆధారాలు లభిస్తే సంబంధిత గ్రూపు అడ్మిన్, దానికి సంబంధించిన వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల నుంచి ఉదయం, సాయంత్రం విద్యార్థులకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్ సోమవారం వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన బస్సు నడపడానికి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా కన్వీనర్ సొప్పరి రమేష్, బహుజన రమేష్, శుక్యా తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలతో రోగ నిరోధక శక్తి

పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని మాధరావుపల్లి, రాయినిపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు వేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఏ సత్యనారాయణ, వీఏ బాలీశ్వర, సిబ్బంది బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి జలనివాసం



ఆత్మకూర్: ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా అభయ ఆంజనేయస్వామి మూల విరాట్ విగ్రహాన్ని జలనివాస కార్యక్రమాన్ని వేదపండితుడు వెంకట్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ప్రముఖ వేదపండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణం కోసం స్వామివారి విగ్రహం జలనివాసంలో ఉంచుతారని, ప్రతినిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. నిర్వహకులు చంద్రశేఖర్‌రెడ్డి, వందనమ్మ, బంగారు శ్రీనివాసులు, శ్రీనివాస్‌శెట్టి, శివశంకర్, శివానంద్‌రెడ్డి, వెంకటేష్, మచ్చేందర్‌గౌడ్, నారాయణ్‌రెడ్డి, ఖాజన్న, జగన్, అశోక్, భక్తులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు సన్మానం

వనపర్తి టౌన్: నీట్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన వైద్య విద్యార్థులు జె.అఖిల్, గంగన్న, గద్వాల శశికిరణ్, జి. కృష్ణ, బి.అక్షయ్, బి.వెంకటేష్, జె.వర్షిత, వెంకటేష్, బి.వికాస్, డి.రాధాకృష్ణ, బి.కృతిక, బి.రత్నం తదితరులను సోమవారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కేశవులు, గంధం గట్టయ్య, చెన్నకేశవులు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరెంట్ స్తంభాలు తొలగించాలి



వనపర్తి రూరల్: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణంలోని వనపర్తి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి అనుగుణంగా రోడ్డు అడ్డంగా ఉన్న కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయంలో ఎస్‌ఈకి విన్నవించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రాములు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాన్‌గల్ పశువైద్యాధికారిగా డా.సురేష్



పాన్‌గల్: మండల నూతన పశువైద్యాధికారిగా డా.సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డా.శ్యామ్ పెద్దమందడి మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో జిల్లాకు నూతనంగా వచ్చిన డా.సురేష్‌కు మండలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ శాఖ సిబ్బంది తోడ్పాటు, మండల ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలో అందుబాటులో ఉంటూ పాడి రైతులకు సేవలు అందిస్తానన్నారు.

వీపనగండ్లకు గణేష్‌కుమార్



వీపనగండ్ల: మండల పశువైద్యాధికారిగా గణేష్‌కుమార్ సోమవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పశు వైద్యాధికారులను నియమించడంతో జనగామ జిల్లా నుంచి ఎంపికైన ఈయన మొదటిసారి పశువైద్యాధికారిగా వీపనగండ్లలో బాధ్యతలు తీసుకున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

వనపర్తి రూరల్: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ పెబ్బేరు మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. సోమవారం పెబ్బేరు మండలంలోని సూగూరులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయనతో పాటు వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు, వ్యాపారస్తులకు వివరిస్తూ వారికి పార్టీ సభ్యత్వాలు అందించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. మండల ఉపాధ్యక్షుడు దేవేందర్‌నాయుడు, కరుణాకర్, రాముడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్లకు చెందిన పూర్వవిద్యార్థి రత్నకుమార్‌గౌడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో పత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులకు సోమవారం అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకర్‌గౌడ్ మాట్లాడుతూ యాపర్ల గ్రామ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వినోద్, ఉపాధ్యాయులు ఇందిర, ఈశ్వర్‌గౌడ్, బాలమ్మ, రమేష్, ఆంజనేయులు, కవిత, శివాని తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

గోపాల్‌పేట: ప్రజలు సోషల్ మీడియా వేదికలు వాట్సాప్, ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాద్యమాల ద్వారా వ్యక్తులు, రాజకీయ నాయకులు, పార్టీల గురించి గాని కించపరిచే విధంగా మాట్లాడటం, అవమానిస్తూ పోస్టులు పెట్టడం సరికాదని ఎస్‌ఐ రాము అన్నారు. ఈ విషయంపై బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే, అది నిజమని ఆధారాలు లభిస్తే సంబంధిత గ్రూపు అడ్మిన్, దానికి సంబంధించిన వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తిటౌన్: పట్టణంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజయ్యగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలానగర్ నుంచి రాయిగడ్డ రూట్‌లో ఇనుప స్తంభాలను మార్చేందుకు కార్యచరణ చేపట్టామన్నారు. అందులో భాగంగానే కమలానగర్, రాయిగడ్డ, బ్రహ్మంగారి వీధి, రామ్‌నగర్‌కాలనీ, చిట్యాల రోడ్డులోని హనుమాన్ ఆలయం వరకు, ర్యాంకర్ స్కూల్ దారిలో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.